# దక్షిణాపథ వార్తావని

ఫిబ్రవరి 2026

సంపుటి – 02
సంచిక – 03

సాంప్రదాయకంగా మన దేశంలో వింధ్యకు దక్షిణాన ఉన్న భూమి దక్షిణాపథంగా పరిగణించబడుతుంది. భారతీయ ఏకాత్మత స్ఫూర్తిగా సమాజాన్ని, మారుతున్న కాలాన్ని ప్రతిబింబిస్తూ గొప్ప రాజకీయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజలు, స్ఫూర్తిదాయక చిహ్నాలను సంగ్రహించడం, సమీకరించడం దక్షిణాపథం పేరిట నడిపే ఈ బులెటిన్ లక్ష్యం. రాష్ట్రాల పరంగా చూస్తే దక్షిణాపథం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పాండిచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలను సూచిస్తుంది. ప్రస్తుతమున్న మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్ మరియు ఒడిషాలోని కొన్ని ప్రాంతాలు కూడా దక్షిణాపథం క్రిందికే వస్తాయి. ఈ ప్రాంతాల విషయాలు ఈ బులెటిన్ లో ప్రస్తావిస్తున్నాము.

## మాఘ పౌర్ణమి (ఫిబ్రవరి 02)



మాసాలన్నింటిలో మాఘ మాసం విశిష్టమైనది. అందులో అనుమానం లేదు. శ్రీ పంచమి (సరస్వతీదేవి), రథసప్తమి (సూర్యుడు), భీష్మ ఏకాదశి (విష్ణుమూర్తి), మహా శివరాత్రి (శివుడు)... ఇలా సకల దేవతలనూ కొలుచుకునేందుకు ఏదో ఒక పర్వదినాన్ని అందించే మాసం ఇది. ఇక మాఘపౌర్ణమి వచ్చిందంటే చాలు పుణ్యతీర్థాలన్నీ కళకళలాడిపోతాయి.

స్నానాలలోకెల్లా మాఘస్నానం ఉత్తమం అని పెద్దలు చెబుతూ ఉంటారు. నదులు, సముద్రాలు, ఆఖరికి గుడిలోని కోనేరులు కూడా ఈ రోజున పవిత్రతను సంతరించుకుంటాయని నమ్మకం. ఇక మాఘపౌర్ణమి నాడు చేసే సముద్ర స్నానం గురించి చెప్పనే అక్కర్లేదు. ఆషాడము, కార్తీకము, మాఘము, వైశాఖము అంటూ నాలుగు నెలలు సముద్ర స్నానానికి అనువైనవిగా మన పెద్దలు పేర్కొన్నారు. ఏడాదిలో కనీసం నాలుగుసార్లన్నా సముద్ర స్నానం చేస్తే అందులోని లవణాలు మనకు ఆరోగ్యాన్ని చేకూరుస్తాయన్నది ఈ నిబంధన వెనుక ఉన్న కారణంగా తోస్తుంది. పైగా ఆ నాలుగు నెలలలోనూ సముద్రపు ఉష్ణోగ్రతలు స్నానానికి తగినట్లుగా ఉంటాయనీ, ఆ సమయంలో సముద్రం మీద పడే చంద్రకిరణాలు కూడా ఔషధతత్వాన్ని కలిగి ఉంటాయనీ అంటారు.

మాఘ పౌర్ణమి కేవలం స్నానానికి మాత్రమే కాదు... ఇష్టదేవతలను అర్చించుకునేందుకు, పితృదేవతలను తలచుకొనేందుకు కూడా అనువైన సందర్భం. ఈ రోజున సూర్యుడినీ, మహాలక్ష్మినీ పూజించడం వల్ల విశేషమైన ఫలితం లభిస్తుందని చెబుతారు. రథసప్తమిన సూర్యజయంతి కారణంగా మాఘమాసం యావత్తూ సూర్యునికి ప్రీతికరమైనది. అందుకే మాఘపౌర్ణమి నాడు సముద్రస్నానంతో పాటుగా... ఆ ప్రత్యక్ష నారాయణునికి ప్రీతికలిగేలా సూర్యాష్టకమ్, ఆదిత్యహృదయం వంటి స్తోత్రాలను పఠించడం మంచిది. ఇక మహాలక్ష్మి అమ్మవారిని ప్రసన్నం చేసుకునేందుకు అమ్మవారిని కానీ విష్ణుమూర్తిని కానీ పద్మాలతో అర్చించమని సూచిస్తుంటారు.

అటు మహాలక్ష్మికే కాదు, ఇటు పార్వతీదేవికి కూడా మాఘపౌర్ణమి ప్రత్యేకమైనదే! భూమి మీద ఒక శంఖు రూపంలో పడిన పార్వతీదేవి, దక్షప్రజాపతి చేయి సోకగానే బాలికగా మారిపోయింది. ఆ బాలికకు సతీదేవి అన్నపేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచుకున్నాడు దక్షుడు. ఇంతకీ శంఖువు, సతీదేవిగా మారిన రోజు మాఘపౌర్ణమే! ఇక మునులలో అతి ప్రసిద్ధుడైన కపిల మహర్షి జన్మించింది కూడా ఈ రోజే అని కొన్ని చోట్ల ప్రస్తావించబడింది. కేవలం హిందువులకు మాత్రమే కాకుండా బౌద్ధులకు కూడా మాఘ పౌర్ణమి ప్రత్యేకమే! బుద్ధుడు తాను త్వరలోనే నిర్వాణం చెందబోతున్నట్లుగా ఈ రోజునే ప్రకటించారట. అందుకని ఈనాడు బౌద్ధులు మతగ్రంథాలైన త్రిపిటకాలను వల్లెవేస్తుంటారు.

చెప్పుకుంటూ పోతే... మాఘపౌర్ణమి ప్రత్యేకతలు చాలానే కనిపిస్తూ ఉంటాయి. మఘ నక్షత్రానికి అధిపతి బృహస్పతి. కాబట్టి ఈ రోజున బృహస్పతిని కనుక పూజిస్తే ఆయన కరుణ లభిస్తుందని చెబుతారు. జ్యోతిషపరంగా బృహస్పతికి ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. జ్ఞానం దగ్గర నుంచీ ధనం వరకూ బృహస్పతి అనేక సంపదలకు, సౌఖ్యాలకు కారకుడు.

ఇన్ని ప్రత్యేకతలు ఉన్నాయి కాబట్టే... మాఘపౌర్ణమిని మహామాఘి అని పిలుచుకుంటారు. ఉత్తరాఖండ్ మొదలుకొని తమిళనాడు వరకు ప్రతి నదీతీరమూ, సముద్ర తీరమూ ఓ కుంభమేళాను తలపిస్తుంది.

## మాడభూషి అనంతశయనం అయ్యంగార్
## (జన్మతిథి - ఫిబ్రవరి 4)

నిస్వార్థ దేశభక్తుడు, ఉత్తమ పార్లమెంటేరియన్, సమర్థుడైన లోక్ సభ స్పీకర్, గొప్ప పండితుడు, మంచి గవర్నర్.. అన్నిటికీ మించి నిరాడంబరుడు, సద్గుణశీలి, వినయ సంపన్నుడు, కర్మయోగి శ్రీ మాడభూషి అనంతశయనం అయ్యంగార్.

www.dakshinapatha.com www.csisindia.com

దక్షిణాపథ స్టడీస్ బులెటిన్

ఈ పత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact research@csisindia.com

Contact : +917075881925



పుణ్యక్షేత్రాల నిలయమైన చిత్తూరు జిల్లాలో శ్రీ పద్మావతీదేవి కొలువైవున్న తిరుచానూరు పుణ్యక్షేత్రంలో 1891 ఫిబ్రవరి 4వ తేదీన, అనంతశయనం అయ్యంగార్ జన్మించారు.

మాడభూషి వారి బాల్యం పేదరికంలోనే గడిచింది. తిరుచానూరులో కొద్దిపాటి ఆదాయంతో వారి కుటుంబం గుట్టుగా జీవితాన్ని గడిపేది. ఆర్థిక ఇబ్బందుల మధ్యనే ఆయన జీవన ప్రయాణం సాగింది. ప్రాథమిక విద్య తిరుచానూరులోనే అభ్యసించాక, ఉన్నతవిద్యకోసం తిరుపతి వెళ్లవలసివచ్చింది. రోజూ తిరుచానూరు నుండి తిరుపతి నడచి వెళ్లి చదువుకొనేవారు. ఆర్థిక ఇబ్బందులకు తోడు, బాల్యంలో ఆయన తండ్రిని కోల్పోయారు. అది ఆయనకు తగిలిన పెద్ద దెబ్బ అయితే అన్నగారు ఆయనను చేరదీసి, చదువు ఆగిపోకుండా చేశారు.

అనంతశయనం మొదటినుండీ తెలివైన విద్యార్థి. అందువల్ల మెట్రిక్యులేషన్ పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఆ రోజుల్లో స్వతంత్ర భావాలు ఉన్న అందరినీ ఆకర్షించేది న్యాయశాస్త్రవిద్య. అందుకే, వారు మద్రాస్ లోని పచ్చయ్యప్ప కళాశాలలో న్యాయవిద్య చదివారు. న్యాయవాద పట్టా వచ్చిన తరువాత, ఆయన తిరుపతి తిరిగి వచ్చి, కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేశారు.

చిత్రమైన పరిస్థితులలో 1922లో చిత్తూరు మునిసిపాలిటీకి అధ్యక్షుడిగా అనంతశయనం ఎన్నిక కావడంతో, ఆయన రాజకీయ జీవితం ఆరంభమైంది. అదే కాలంలో తిరుపతిలో ఉండే తెంగలై, వడగలై అనే వైష్ణవ శాఖల మధ్య వచ్చిన చిహ్నాల కేసును సమర్థవంతంగా వాదించి గొప్ప గుర్తింపు పొందారాయన. 1937లో అనంతశయనం మద్రాసు లెజిస్లేటివ్ అసెంబ్లీలో సభ్యుడిగా పదవీ ప్రమాణం చేశారు. ఆ రోజుల్లో ఆయన చురుకుదనాన్ని, పనితీరుని చూసిన అందరూ అనంతశయనాన్ని "నడుస్తున్న విజ్ఞానసర్వస్వ"మని ప్రశంసించేవారు. 1937 నుండి 1942 వరకూ శాసనసభ్యునిగా ఎంతో సమర్థవంతంగా తన బాధ్యతల్ని నిర్వహించారు.

స్వాతంత్ర్య సమరంలో అతి ముఖ్యమైన ఘట్టం శాసనోల్లంఘన ఉద్యమం. ఆ ఉద్యమంలో మహాత్మాగాంధీజీ పిలుపు నందుకొని అనంతశయనం ఎంతో ఉత్సాహాన్ని, తెగువని చూపించారు. ముఖ్యంగా వేంకటేశ పత్రికతోపాటుగా, ఇతర పత్రికల్లోనూ ఆయన ఎన్నో వ్యాసాలు వ్రాసేవారు. ఈ పరిస్థితులలో, అనంతశయనాన్ని అరెస్ట్ చేసింది బ్రిటిష్ ప్రభుత్వం. వేలూరు సెంట్రల్ జైలులో పద్దెనిమిది నెలలు జైలు శిక్షను అనుభవించారాయన. ఆ తరువాత సత్యాగ్రహ ఉద్యమంలో చిత్తూరు సభలో మాట్లాడుతున్న అనంతశయనంను పోలీసులు అరెస్ట్ చేసి, తిరుచ్చిరాపల్లి జైలులో నిర్బంధించారు. అక్కడినుండి నాగపూర్ కు దగ్గరలో ఉన్న అమరావతీ జైలులో మరికొంతకాలం జైలుశిక్ష అనుభవించారు.

మానవసేవే మాధవ సేవ అనే సూక్తిని అక్షరాల పాటించారు, అనంతశయనం గారు. తాను పుట్టిపెరిగిన తిరుచానూరు, తిరుపతిలో వివిధ దేవాలయాల వద్ద యాచకులుగా మారిన కుష్ఠురోగుల పరిస్థితి అయ్యంగార్ ను కదిలించింది. చిత్తూరు జిల్లా కలెక్టర్ తో మాట్లాడి 1938లో చిత్తూరు, తిరుపతిలలో కుష్ఠు వ్యాధి నివారణ కేంద్రం ఏర్పాటు చేశారు. వారికి వైద్య సాయంతో పాటు వారి పిల్లల కోసం పాఠశాల, కూరగాయలు, గోధుమలు పండించుకునేందుకు తహసీల్దార్ తో మాట్లాడి పది ఎకరాల ప్రభుత్వ భూమిని సంపాదించిపెట్టారు. వారికి పింఛన్ కూడా మంజూరు చేయించడంతోపాటు వారికి అవసరమైన పాదరక్షలను ఆర్కాట్ లో తయారయ్యేలా చూశారు.

'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గీత రచయిత శంకరంబాడి సుందరాచారి ఆయనకు సమీప బంధువు. తెలుగుతల్లిపై గేయ రచనకు అయ్యంగారే స్ఫూర్తి అని సుందరాచారి చెప్పేవారు. వివిధ రంగాలలో తనదైన ముద్ర వేసిన అయ్యంగార్ చివరి రోజుల్లో తీవ్రంగా అనారోగ్యం బారినపడి తిరిగి కోలుకొన్నారు. కానీ హఠాత్తుగా 1978వ సంవత్సరం మార్చి 19వ తేదీన తిరుపతిలో మరణించారు.

## శ్రీ గురూజీ, మాధవ రావు సదాశివ రావు గోళ్వాల్కర్, (జన్మతిథి, మాఘ బహుళ ఏకాదశి, ఫిబ్రవరి 13)



శ్రీ మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ – జాతి ఆత్మకు అర్పితమైన జీవన గాథ.

కాలానికి కొందరు వ్యక్తులు దొరుకుతారు. కాని కాలాన్నే మలిచే వ్యక్తులు అరుదు. వారు మాటలతో కాదు, జీవితంతో మాట్లాడతారు. అధికారంతో కాదు, త్యాగంతో ప్రభావం చూపుతారు. భారతజాతి ఆధునిక చరిత్రలో అటువంటి అరుదైన మహనీయులలో శ్రీ మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ గారు ఒకరు.

అభిమానంతో "గురూజీ" అని పిలువబడిన ఆయన, ఒక వ్యక్తి కంటే ఎక్కువగా ఒక జాతి చైతన్యానికి ప్రతిరూపం.

1906 వ సంవత్సరంలో మాఘ శుద్ధ ఏకాదశి రోజున నాగపూర్ సమీపంలో గల రాంటెక్ లో జన్మించిన గోల్వాల్కర్ గారి బాల్యం సాధారణంగా కనిపించినా, అందులో అసాధారణమైన అంతర్ముఖత ఉంది. ఆటలకంటే ఆలోచనలతో, శబ్దాలకంటే మౌనంతో ఆయన బాల్యం వికసించింది. ఇతిహాసాలు, ధార్మిక గ్రంథాలు, తల్లి నోట వినిన నీతి కథలు – ఇవన్నీ ఆయన హృదయంలో భారత జాతి పట్ల అలిఖితమైన నిబద్ధతను నాటాయి. ఆ నిబద్ధత కాలంతో కరిగిపోలేదు, జీవితాంతం సాధనగా మారింది.

బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో జీవశాస్త్రం వంటి శాస్త్రీయ విభాగంలో అత్యున్నత ప్రతిభను ప్రదర్శించిన గోల్వాల్కర్ గారు చాలా సులభంగా వ్యక్తిగత విజయ శిఖరాలకు చేరగలిగేవారు. కానీ ఆయన ఎదుట నిలిచిన ప్రశ్న, వ్యక్తిగత భవిష్యత్తు గురించి కాదు, జాతి భవిష్యత్తు గురించి. వ్యక్తిగత కీర్తి కన్నా సామూహిక కర్తవ్యమే గొప్పదని ఆయన ఆ క్షణమే నిర్ణయించుకున్నారు. అది ఒక నిర్ణయం కాదు, ఒక జీవితపు మలుపు.

డా. కేశవ్ బలిరాం హెడ్గేవార్ గారి సన్నిధి గోల్వాల్కర్ గారి జీవితానికి స్పష్టమైన దిశను ఇచ్చింది. అక్కడ ఆయన గ్రహించిన సత్యం – జాతి నిర్మాణం నినాదాలతో కాదు, వ్యక్తి నిర్మాణంతో జరుగుతుంది.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ప్రవేశ క్షణం నుంచే ఆయన జీవితం తనదిగా మిగలలేదు. అది సమాజానికి అంకితమైంది. 1940లో సర్

సంఘచాలక్‌గా బాధ్యతలు స్వీకరించిన కొద్దికాలానికే, దేశం విభజన వేదనతో తన ఆత్మను కోల్పోయిన కాలం. అటువంటి సమయంలో గోల్వాల్కర్ గారు నిశ్శబ్దంగా వెలిగిన దీపంలా జాతి చైతన్యాన్ని కాపాడారు. జాతి పట్ల వారి నిబద్ధత -- భావోద్వేగం కాదు, ఒక తపస్సు. గోల్వాల్కర్ గారి దృష్టిలో జాతి ఒక రాజకీయ నిర్వచనం కాదు. అది వేల ఏళ్ల సంస్కృతీ ప్రవాహం, ఆధ్యాత్మిక సాధన ఫలితం, తరతరాల త్యాగాల సమాహారం. అందుకే ఆయన జీవితం వ్యక్తిగత సౌకర్యాలకు దూరమైంది. ఆస్తి లేదు. కుటుంబ జీవితం లేదు. కానీ, జాతి కోసం పరితపిస్తూ సేవ చేయడంలో అపారమైన ఆత్మసంతృప్తి ఉంది. రైలుపెట్టెనే నివాసంగా దేశమంతా నిరంతరం పర్యటిస్తూ లక్షలాది యువ హృదయాల్లో క్రమశిక్షణను, సేవాభావాన్ని, త్యాగంలో గౌరవాన్ని నాటారు.

“విచారధార” వంటి గ్రంథాల్లో గోల్వాల్కర్ గారు సమాజానికి ఇచ్చింది ద్వేషం కాదు, దిశ. విభజన కాదు, ఐక్యత. ఆయన ఆలోచనలు అందరికీ ఆమోదయోగ్యంగా ఉండిఉండకపోవచ్చు. కానీ ఆ ఆలోచనల వెనుకనున్న జాతి పట్ల అచంచల నిబద్ధతను ఎవరూ కాదనలేరు.

1973లో గోల్వాల్కర్ గారి శరీరం శాశ్వత విశ్రాంతి తీసుకున్నా, ఆయన ఆలోచనలు ఆగలేదు. ఆయన సాధన కొనసాగుతూనే ఉంది. ఈ రోజు కూడా ఎక్కడ సేవ కనిపిస్తుందో, ఎక్కడ క్రమశిక్షణ నిలుస్తుందో, ఎక్కడ “నేను కాదు, సమాజం” అనే భావన జీవిస్తుందో, అక్కడ గోల్వాల్కర్ గారి ఆత్మ ప్రతిధ్వనిస్తుంది.

శ్రీ మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ గారు ఒక వ్యక్తి కాదు, ఒక యుగ చైతన్యం. ఆయన జీవితం మనకు చెప్పేది చాలా స్పష్టమైన విషయం - జాతి కోసం జీవించిన జీవితం ఎప్పుడూ వ్యర్థం కాదు. ఆ త్యాగధనుని గాథ భారత జాతి చరిత్రలో ఒక నిశ్శబ్ద విప్లవంలా, ఒక అమర సాధనలాగా చిరస్థాయిగా నిలిచిపోతుంది.

## హిందూ పండుగలు -- ప్రకృతి మధ్య అనుబంధం



భారతదేశ సంస్కృతి వేల సంవత్సరాల చరిత్ర కలిగినది. ఈ సంస్కృతిలో పండుగలు కేవలం ఆనందోత్సవాలుగా మాత్రమే కాకుండా, జీవన విధానానికి మార్గదర్శకాలుగా నిలుస్తాయి. ముఖ్యంగా హిందువులు జరుపుకునే పండుగలన్నీ ప్రకృతితో గాఢంగా ముడిపడి ఉన్నవని గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తపరిచే విధంగా ఈ పండుగలు రూపుదిద్దుకున్నాయి.

### ప్రకృతిని దైవంగా భావించిన దృక్పథం

హిందూ ధర్మంలో ప్రకృతి దైవ స్వరూపంగా భావించబడుతుంది. నదులను మాతలుగా, పర్వతాలను దేవతలుగా, వృక్షాలను పూజనీయంగా చూసే సంప్రదాయం ఉంది. ఈ దృక్పథం వెనుక ఉన్న భావన, మనిషి ప్రకృతిలో భాగం మాత్రమే, అధిపతి కాదు అన్నది. అందుకే పండుగలన్నీ ప్రకృతిని గౌరవించేలా రూపకల్పన చేయబడ్డాయి.

### పంటలు, ఋతువులు - పండుగల ఆధారం

హిందూ పండుగలు పంటలతో, ఋతు మార్పులతో ముడిపడి ఉంటాయి.

- మకర సంక్రాంతి సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే సందర్భం. ఇది రబీ పంట కోత పూర్తయిన ఆనందాన్ని సూచిస్తుంది. రైతులు భూమికి, సూర్యుడికి కృతజ్ఞతలు తెలుపుతారు. గొబ్బెమ్మలు, గంగిరెద్దుల పూజ, పశువులకు గౌరవం - ఇవన్నీ వ్యవసాయ జీవనానికి ప్రకృతి ఎంత ముఖ్యమో చాటుతాయి.

- ఉగాది కొత్త సంవత్సరారంభం మాత్రమే కాదు, వసంత ఋతువు ఆరంభం కూడా. ప్రకృతిలో కొత్తదనం - చెట్లకు చిగుర్లు, పుష్పాలు కనిపించే కాలం. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు మనిషి జీవితం ప్రకృతిలాగే సుఖదుఃఖాల సమ్మేళనమని తెలియజేస్తాయి.

### వర్షాలు, నీరు - జీవనాధారం

నీరు లేకుండా జీవితం అసాధ్యం. దీనిని గుర్తుచేసే పండుగలు కూడా ఉన్నాయి.

- చాతుర్మాస వ్రతాలు వర్షాకాలంలో ప్రకృతికి విశ్రాంతి ఇవ్వాలన్న భావనను సూచిస్తాయి. ఈ కాలంలో నియమాలు పాటించడం ద్వారా మనిషి ప్రకృతితో సమన్వయంగా జీవించాలి అనే బోధన లభిస్తుంది.

### అగ్ని, కాంతి - దీపావళి ప్రాముఖ్యత

దీపావళి కేవలం దీపాల పండుగ మాత్రమే కాదు. చీకటిని తొలగించే కాంతికి ప్రతీకగా అగ్ని పూజించబడుతుంది. ఇది శీతాకాల ఆరంభంలో వస్తుంది. పంట కోత అనంతరం ఇంటిని శుభ్రపరచడం, దీపాలు వెలిగించడం ద్వారా పరిశుభ్రత, శక్తి, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యం ఇస్తారు.

### వృక్షాలు, జంతువులు - పూజనీయమైన ప్రకృతి

హిందూ పండుగలలో చెట్లు, మొక్కలు, జంతువులు కూడా పూజించబడతాయి.

- వటసావిత్రి వ్రతం లో వటవృక్షం పూజించబడుతుంది. ఇది దీర్ఘాయుష్షు, పర్యావరణ రక్షణకు సంకేతం.

- గోవు పూజ, నంది, హనుమంతుడు, నాగులు–ఇవన్నీ జంతుజాలానికి ఇచ్చే గౌరవానికి నిదర్శనం.

### గణేష్ చతుర్థి - ప్రకృతి సంరక్షణ సందేశం

వినాయక చవితి మట్టి వినాయకులతో జరుపుకోవడం సంప్రదాయం. మట్టిలోంచి తయారై మట్టిలోనే కలిసిపోయే విగ్రహం –ఇది ప్రకృతి చక్రాన్ని సూచిస్తుంది. ఈ పండుగ మనకు ప్రకృతితో సమతుల్యతగా జీవించాలి అనే సందేశం ఇస్తుంది.

### శాస్త్రీయత మరియు పర్యావరణ స్పృహ

ఈ పండుగలన్నింటిలో శాస్త్రీయత దాగి ఉంది. ఋతువులకు అనుగుణంగా ఆహారం, జీవనశైలి మార్పులు, శరీర ఆరోగ్యం, మానసిక సమతుల్యత ఇవన్నీ పండుగల ద్వారా సాధించబడతాయి. ఆధునిక కాలంలో “పర్యావరణ సంరక్షణ” అనే పదం వినిపిస్తున్నా, మన పండుగలు వేల సంవత్సరాల నుంచే అదే భావనను బోధిస్తున్నాయి.

ఈ విధంగా హిందువులు జరుపుకునే ప్రతి పండుగ ప్రకృతితో విడదీయరాని బంధం కలిగి ఉంది. ఇవి కేవలం ఆచారాలు కాదు – ప్రకృతిని గౌరవించాలి, కాపాడాలి, కృతజ్ఞతతో జీవించాలి అనే జీవన తత్వం. నేటి పర్యావరణ సంక్షోభాల సమయంలో ఈ పండుగల అసలైన భావాన్ని అర్థం చేసుకుని ఆచరించడం అత్యంత అవసరం. అప్పుడు మాత్రమే మన సంస్కృతి సార్థకత, ప్రకృతి సంరక్షణ రెండూ నిలుస్తాయి.

## ఉమామహేశ్వరాలయం, యాగంటి (కర్నూలు జిల్లా)



సాధారణంగా శైవ క్షేత్రాలలో శివుని ఆలయం, అమ్మవారి ఆలయం ఇరువురి రూపాలు విడి విడిగా ఉంటాయి. అయితే, అర్థనారీశ్వర రూపంతో విలసిల్లే క్షేత్రాలు చాలా అరుదుగా ఉంటాయి. అటువంటి వాటిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా యాగంటి లోని శ్రీ ఉమా మహేశ్వర ఆలయం ఒకటి. ఈ ఆలయ నిర్మాణం క్రి.శ.15 వ శతాబ్దంలో జరిగింది. కానీ, అంతకు మునుపే ఎన్నో వందల సంవత్సరాల నుండి ఇక్కడ అగస్త్య మహర్షి నిర్మించిన ఆలయం ఉన్నట్లు ఇక్కడి స్థాన చరిత్ర చెబుతున్నది. అయితే విజయనగర రాజుల కాలంలో ఈ ఆలయం ఎంతో వైభవంతో విలసిల్లింది. రాతితో నిర్మించిన ఈ శిల్ప కళా వైభవం నేటికీ తన కళా కాంతులను ప్రసరిస్తూనే ఉంది. ఇక్కడి అర్థనారీశ్వరుడు నేటికీ నిత్య పూజలందుకుంటూ భక్తులకు కోరిన వరాలను తీర్చే భక్త వల్లభుడుగా వినతి కెక్కాడు.

ఆ పరమశివుని ప్రత్యక్షంగా చూసిన తన్మయత్వంతో చిట్టెప్ప అనే శివభక్తుడు 'నేగంటి' అనగా 'నేను కాంచినాను' అంటే 'నేను చూశాను' అని మహా పరవశంతో ఆ భోళాశంకరుణ్ణి ప్రస్తుతించాడు. నాటి నుండి ఈ ప్రదేశం పేరు 'నేగంటి' గా స్థిరపడింది. కాలక్రమేణా అది యాగంటి గా పరిచయమైనది. అగస్త్య మహర్షి ఇక్కడ సహజంగా ఏర్పడిన గుహలో చాలా సంవత్సరాలు తపమాచరించారని స్థల పురాణం చెబుతున్నది. అర్థనారీశ్వరుని ఏకశిలా విగ్రహం వీక్షించిన చాలు, మన సంస్కృతి, మనవారి పనితనం ఏమిటో అర్థమౌతుంది. ఇక్కడ సహజసిద్ధంగా ఏర్పడిన గుహలు ఎంతో ప్రకృతి రమణీయంగా ఉండి పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

సాధారణంగా రాయికి వాతావరణ తాకిడి వలన తరుగుదల ఉండవచ్చు, కానీ పెరుగుదల ఉండదు. అయితే ఇక్కడ రాతితో చెక్కబడిన నంది విగ్రహం ప్రతి 20 సంవత్సరాలకు ఒక అంగుళం చొప్పున పెరుగుతున్నది. ఇది నిజంగా ఒక విచిత్రమే. ముడుత పర్వతాలైన హిమాలయాలు కూడా పెరుగుతున్నాయని ఈ మధ్యనే శాస్త్రవేత్తలు కనుగొన్నారు. భూమి పొరలలో ఫలకాల మధ్య ఏర్పడుతున్న వ్యత్యాసం మరియు వత్తిడి అందుకు కారణం కావచ్చు. మరి ఇక్కడ ప్రస్తుతం ఈ ఏకశిలా విగ్రహం అయిన నంది పెరుగుటకు, మరి ఆ విగ్రహం అడుగున భూమిలో ఏమి జరుగుతున్నదో శాస్త్రవేత్తలే చెప్పాలి.

సాధారణంగా రాయలసీమలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుంది. కానీ ఇక్కడి పుష్కరిణిలో మాత్రం నీరు పుష్కలంగా ఉండి స్వామి వారిని దర్శించే భక్తులకు దాహార్తిని తీరుస్తుంది.

మరొక విచిత్రం ఏమిటంటే, సాధారణంగా కాకులు లేని ప్రదేశాలు ఉండవు. కానీ ఈ యాగంటి ప్రాంతంలో కాకులు మనకు అసలు కనపడవు. అగస్త్య మహాముని శాపం వలన ఇక్కడ కాకులు సంచరించవనీ, తద్వారా కాకి వాహనంగా ఉన్న శనైశ్వరుడు కూడా ఇక్కడ నివసించడని భక్తుల నమ్మకం. బహుశా కాకులను దూరంగా ఉంచే వృక్షం ఏమైనా ఈ ప్రాంతంలో ఉందేమో!

ఈ విధంగా ప్రకృతి రమణీయతను కలబోసుకుని ఎన్నో అద్భుతాలకు తావైన యాగంటి ఉమామహేశ్వరాలయం దర్శించడం అభినందనీయం.

## శ్రీ మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ గారి "బంచ్ ఆఫ్ థాట్స్"

## నేటికీ అత్యంత ప్రాసంగికమైన జాతీయ, సాంస్కృతిక దార్శనికత




భారత జాతీయ ఆలోచనల ప్రవాహంలో మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ (శ్రీగురుజీ) గారి స్థానం ప్రత్యేకమైనది. ఆయన రచించిన "బంచ్ ఆఫ్ థాట్స్" అనేది ఒక సిద్ధాంత గ్రంథం కంటే, భారత జాతి ఆత్మను అర్థం చేసుకునే దార్శనిక మార్గదర్శినిగా చెప్పవచ్చు. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం ఎదుర్కొన్న గుర్తింపు, ఐక్యత, విలువల సంక్షోభానికి ప్రతిస్పందనగా ఈ ఆలోచనలు రూపుదిద్దుకున్నాయి. ఆశ్చర్యకరంగా, ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా ఈ గ్రంథంలోని భావనలు నేటి భారత సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తిని కలిగి ఉన్నాయి.

**1. జాతీయత: రాజకీయ భావన కాదు - జీవన తత్వం**

గోల్వాల్కర్ గారి జాతీయత భావన చాలా లోతైనది. అది కేవలం రాష్ట్రం లేదా ప్రభుత్వానికి సంబంధించినది కాదు; సామూహిక చరిత్ర, సంస్కృతీ వారసత్వం, సామూహిక బాధ్యత భావన ఇవన్నీ కలిసిన జీవన తత్వం.

**నేటి ప్రాసంగికత:**

ప్రపంచీకరణ వల్ల దేశాల మధ్య సరిహద్దులు మసకబారుతున్న ఈ కాలంలో, ప్రతి జాతీ తన ప్రత్యేకతను కాపాడుకోవాలనుకుంటోంది. భారతదేశం లాంటి పురాతన నాగరికతకు ఈ జాతీయ చైతన్యం మరింత అవసరం. గోల్వాల్కర్ గారి ఆలోచనలు భారతీయుడిలో ఆత్మగౌరవం, స్వదేశీ భావన, జాతీయ బాధ్యతను బలపరుస్తాయి.

**2. సంస్కృతి: సమాజానికి ఆత్మ**

"సంస్కృతి లేని జాతి శరీరం లేని ఆత్మ వంటిది" అనే భావన గోల్వాల్కర్ గారి రచనలలో స్పష్టంగా కనిపిస్తుంది. ఆయనకు సంస్కృతి అనేది ఆచారాల సమాహారం కాదు – అది విలువల వ్యవస్థ, నైతిక క్రమం, జీవన దృక్పథం.

**నేటి ప్రాసంగికత:**

ఆధునిక సాంకేతిక పురోగతి మధ్య నైతిక విలువలు, కుటుంబ బంధాలు, సమాజం పట్ల బాధ్యత తగ్గుతున్నాయన్న ఆందోళన ఉంది. ఈ సందర్భంలో, సంస్కృతి కేంద్రంగా జీవితం నిర్మించుకోవాలన్న ఆలోచన సమాజానికి స్థిరత్వాన్ని అందిస్తుంది.

**3. సంఘటిత సమాజం: జాతీయ శక్తికి మూలం**

గోల్వాల్కర్ గారి దృష్టిలో సంఘటన (Organization) అనేది శక్తి యొక్క మూలం. విభజిత సమాజం బలహీనమవుతుందనీ, ఐక్య సమాజమే సవాళ్లను ఎదుర్కొగలదనీ ఆయన స్పష్టం చేస్తారు.

**నేటి ప్రాసంగికత:**
నేటి కాలంలో సామాజిక మాధ్యమాలు, వాదోపవాదాలు సమాజాన్ని చీల్చే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో, పరస్పర విశ్వాసం, సహకారం, సమాజ హితం అనే విలువలు మరింత అవసరం. గోల్వాల్కర్ గారి ఆలోచనలు సామూహిక శ్రేయస్సుపై దృష్టిని పెంచుతాయి.

**4. వ్యక్తి, సమాజ సమతుల్యం**
గోల్వాల్కర్ గారు వ్యక్తిని నిర్లక్ష్యం చేయలేదు; కానీ వ్యక్తి అభివృద్ధి సమాజ అభ్యున్నతితో అనుసంధానమై ఉండాలని చెప్పారు. వ్యక్తి హక్కులు, సమాజ కర్తవ్యాలు ఈ రెండింటి మధ్య సమతుల్యం అవసరమన్నది ఆయన కేంద్ర ఆలోచన.

**నేటి ప్రాసంగికత:**
నేటి అత్యంత వ్యక్తివాద ప్రపంచంలో, "నేను" కంటే "మనము" అనే భావన అవసరం. ఇది పౌరసత్వ బాధ్యతలు, స్వచ్ఛంద సేవ, సమాజ సేవా కార్యక్రమాలకు ప్రేరణనిస్తుంది.

**5. విద్య: ఉద్యోగం కోసం కాదు - జీవిత నిర్మాణం కోసం**
బంచ్ ఆఫ్ థాట్స్ లో విద్యకు ఇచ్చిన ప్రాధాన్యం విశేషం. గోల్వాల్కర్ గారి దృష్టిలో విద్య లక్ష్యం – జ్ఞానం, క్రమశిక్షణ, సేవాభావం మరియు దేశభక్తి.

**నేటి ప్రాసంగికత:**
కేవలం మార్కెట్ అవసరాలకు తగ్గ విద్య కాకుండా, బాధ్యతాయుత పౌరులను తయారుచేసే విద్యా విధానం నేటి అవసరం. ఈ ఆలోచన నూతన విద్యా విధాన చర్చలో కూడా ప్రతిధ్వనిస్తుంది.

**6. రాజకీయాలు: అధికార సాధనం కాదు - సేవా సాధనం**
గోల్వాల్కర్ గారి రాజకీయ దృక్పథం నైతికతపై ఆధారపడింది. రాజకీయాలు సమాజ సేవకు ఒక మార్గం కావాలనీ, వ్యక్తిగత ప్రయోజనాలకు కాకూడదనీ ఆయన అభిప్రాయం.

**నేటి ప్రాసంగికత:**
పారదర్శకత, విలువల ఆధారిత నాయకత్వం, ప్రజాసేవ – ఇవన్నీ నేటి ప్రజాస్వామ్యానికి అత్యవసరం. ఈ కోణంలో ఆయన ఆలోచనలు ఆదర్శప్రాయంగా నిలుస్తాయి.

బంచ్ ఆఫ్ థాట్స్ గొప్పతనం ఏమిటంటే, ఇది ఒక నిర్దిష్ట కాలానికి పరిమితం కాలేదు. ఆలోచనల సారాన్ని తీసుకుని, కాలానుగుణంగా అన్వయించుకునే అవకాశం ఉంది. అందుకే ఇవి నేటికీ సజీవంగా ఉన్నాయి.

మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ గారి "బంచ్ ఆఫ్ థాట్స్" భారత జాతి ఆత్మను బలపరిచే, సమాజాన్ని సంఘటితం చేసే, వ్యక్తిలో బాధ్యత భావనను పెంపొందించే ఒక నిర్మాణాత్మక దార్శనిక గ్రంథం. ఆధునికతను తిరస్కరించకుండా, మూలాలను మరచిపోకుండా ముందుకు సాగాలన్న సందేశమే దీని సారాంశం. నేటి భారతదేశానికి అవసరమైనది కూడా ఇదే – వికాసం, విలువలు, ఆధునికత, సంస్కృతి, వ్యక్తి అభివృద్ధి, జాతీయ శ్రేయస్సు.

ఈ సమన్వయానికి "బంచ్ ఆఫ్ థాట్స్" ఒక శక్తివంతమైన ఆలోచనా ప్రేరణగా నిలుస్తుంది.

## కూడవెళ్ళి జాతర (మాఘ మాసంలో)



దక్షిణ భారతదేశంలో తెలంగాణ రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలో కూడవెళ్ళి అనే ప్రాంతంలో త్రేతాయుగంలో సీతమ్మ సమేతంగా శ్రీరామచంద్రస్వామి వారి కరకమలాలచే ప్రతిష్ఠించిన శివలింగం అత్యంత విశిష్టమైనది.

కూడవెళ్ళి అనే పేరు ఎలా వచ్చిందంటే ఈ గ్రామం రెండు వాగుల సంగమ స్థలం. ఇక్కడి దేవాలయ వాయువ్య భాగంలో నది ఉత్తర వాహినిగా ప్రవహిస్తూ వాయువ్యంలో కలుస్తుంది. రెండు వాగులు కలిసి ప్రవహిస్తున్నాయి కాబట్టి కూడవెళ్ళి అనే పేరు వచ్చింది. మాండవ్యనది ప్రాంతంలో వెలసిన గ్రామమే కూడవెళ్ళి.

శ్రీరాముడికి ఉభయ సంధ్యలలో స్నానం చేసి, శివలింగార్చన చేసే అలవాటు ఉంది. రావణున్ని సంహరించి అయోధ్యకు తిరిగి వెళ్లే సమయంలో ఈ ప్రాంతానికి చేరుకుని, అక్కడ కొంత సేదతీరి, సంధ్యా సమయంలో ఇక్కడ ప్రవహించే ( మాండవ్యనది ) కూడవెళ్ళి వాగులో స్నానం ఆచరించిన పిమ్మట – లంకాధీశ్వరుడు, వేదపండితుడైన రావణాసురుని చంపిన బ్రహ్మహత్య మహా పాతకం తనకు తగలకూడదని భావించి దోష నివారణ కొరకు లింగ ప్రతిష్ట చేసి లింగార్చన చేయుటకు సంకల్పించాడు. కానీ అక్కడ శివాలయాలు లేకపోవడం చేత దోషనివృత్తం కొరకు శివలింగం అవసరం కాబట్టి శ్రీరాముడికి నమ్మిన బంటైన హనుమంతున్ని కాశీకి వెళ్లి శివలింగం తెమ్మని పంపిస్తాడు.

హనుమంతుడు రాముని ఆజ్ఞ ప్రకారం వాయువేగంతో కాశీ పట్టణం చేరుకుని అక్కడ సందిగ్ధంలో పడతాడు. కాశీ క్షేత్రంలో ఏ వైపు చూసిన శివలింగాలు కనిపించడంతో, ఏ లింగం తీసుకువెళ్లాలి అని ఆలోచిస్తూ ఉండి పోయాడు. ఇంతలో శ్రీరాముడు శివలింగ పూజ కొరకు సంధ్య ఘడియలు ముగిస్తే ఫలితం ఉండదు అని భావన చెంది, ఏ కారణం చేత హనుమ రాలేదో అనుకుని, కాలాన్ని వృధా చేయక అక్కడ ఉన్న ఇసుకతో రామేశ్వరంలో ఉన్న సైకత లింగం మాదిరిగా శివలింగం తయారు చేసి పూజ ప్రారంభిస్తాడు.

ఇంతలోనే ఆంజనేయుడు కాశీ క్షేత్రం నుండి లింగాన్ని తీసుకుని వస్తాడు. తన ప్రభువునకు సమయానికి లింగాన్ని అందివ్వలేదని ఎంతో దీనంగా బాధపడుతున్న హనుమంతున్ని చూసి... "హనుమా నీవు చింత చెందకు, నీవు తెచ్చిన శివలింగం వృధాకాదు, నేను తాత్కాలికంగా చేసిన ఈ సైకత లింగం పక్కనే నీవు భక్తితో తెచ్చిన శివలింగాన్ని ప్రతిష్టిస్తాను" అని ఓదారుస్తూ, హనుమంతుని చేతిలో ఉన్న లింగాన్ని, తాను అంతకుముందు తయారు చేసిన ఇసుక లింగం పానవట్టంపై పెట్టి ఆ రెండింటికీ ప్రాణ ప్రతిష్ట చేసి తన పూజ కొనసాగిస్తాడు. నాటి నుండి శ్రీరామలింగేశ్వర దేవాలయం అనే పేరుతో కూడవెళ్ళి ఆలయం ప్రసిద్ధి చెందినది.

నాటి నుండి నేటి వరకు ఈ మహాక్షేత్రంలో ప్రతి సంవత్సరం పుష్యబహుళ అమావాస్య మొదలుకుని మాఘ శుద్ధ విదియ వరకు అనగా మూడు రోజులపాటు జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహింపబడుతున్నాయి. ఈ ప్రత్యేక జాతర ఉత్సవ సమయంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం మొదలుకుని, అనేక విశేష పూజలు జరుగుతాయి. ఇక్కడ రామలింగేశ్వరస్వామితోపాటు, శ్రీ వేణుగోపాలస్వామి,

సంగమేశ్వరస్వామి, వీరభద్రస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, శ్రీవీరాంజనేయస్వామి ఆలయాలను కూడ భక్తులు దర్శించి తరిస్తారు.

ఈ జాతర పుష్య అమావాస్య ఘడియలు దాటకముందు ప్రదోషకాల సమయంలో రామేశ్వరపల్లి గ్రామశివారులో ఉన్న పులిగుండ్ల అనే ఊరి నుండి శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకి సేవతో భక్తుల భజనలు, కీర్తనలతో దేవాలయమునకు చేరుస్తారు. అమావాస్య నుండి భక్తులు కూడవెళ్ళి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, శ్రీరాముడు, ఆంజనేయుడు కలిసి ప్రతిష్టించిన ఒకే పానవట్టంపై గల రెండు శివలింగాలను ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి వారి వారి మొక్కులను చెల్లించుకుంటారు.

అరుదైన రెండు శివలింగాలు రెండూ ఒకే పానుపట్టంపై ఉన్నట్టు మరే ఆలయంలో కూడా మనకు కనిపించదు. ఇది కూడవెళ్ళి శ్రీరామలింగేశ్వర ఆలయ ప్రత్యేకత. ఈ మూడు రోజులు భక్తులు ఎక్కడెక్కడినుండో తండోప తండాలుగా వచ్చి దర్శించుకుంటారు. ఇక్కడ ఉండడానికి ఎటువంటి సత్రాలు లేకపోయిననూ భక్తులు గూడారాలు వేసుకుని, వంటచేసుకుని తిని, రాత్రి నిద్ర చెస్తారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం కొలిచిన వారికి కొంగు బంగారంవలే భక్తుల కోరికలను తీరుస్తూ ఉన్నందున దేశంలోని వివిధ ప్రాంతాల నుండి అనేకమంది వచ్చి స్వామి దర్శనం చేసుకుని తమకున్న కోరికలను తీర్చమని వేడుకుంటారు. ఈ క్షేత్ర దర్శనం చేసిన వారికి కాశీ, రామేశ్వరం వెళ్ళిన పుణ్యఫలం దక్కుతుందని పెద్దలు అంటారు.

### ఈ నెలలో ఇతర ముఖ్యమైన రోజులు:

1. భద్రాచల రామదాసు జయంతి , ఫిబ్రవరి 04
2. మహా శివరాత్రి, ఫిబ్రవరి 15
3. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి, ఫిబ్రవరి 19
4. వీర సావర్కర్ వర్ధంతి, ఫిబ్రవరి 26

ఈ పత్రిక లో దక్షిణాపథ యొుక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి
research@csisindia.com

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact
research@csisindia.com
Contact : +917075881925



